క్లుప్తంగా

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



కారెంపూడి: ఏపీ టీచర్స్ ఫెడరేషన్ 2024 క్యాలెండర్, డైరీలను మండల విద్యా శాఖాధికారి టి.రవికుమార్ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘ మండల అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లునాయక్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ ప్రసన్న, జి.భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

గ్లోరి ఆఫ్ క్రైస్ట్ చర్చిలో ఉపవాస కూడికలు



విజయపురిసౌత్: స్థానిక గ్లోరి ఆఫ్ క్రైస్ట్ చర్చిలో డాక్టర్ రెవరెండ్ దానియేలు ఆధ్వర్యంలో మంగళవారం 40 దినాల ఉపవాస ప్రార్థనా కూడికలను ప్రారంభించారు. ముందుగా ఆయన చర్చి వద్ద పావురాలను ఎగురవేసి అనంతరం భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రపంచ దేశాలలోని ప్రజలకు శాంతి, సమాధానం, క్షేమాన్ని మహోన్నతుడైన దేవుడు కలుగజేయాలని ప్రార్థించారు. గడిచిన 2017వ సంవత్సరం నుంచి ఈ ఉపవాస ప్రార్థనా కూడికలు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కూడికల ద్వారా అందరూ దేవుని సన్నిధిలో గడిపే అవకాశం లభిస్తుందన్నారు. ముందుగా భక్తులకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సిస్టర్ మహిమా దానియేలు, పాస్టర్లు, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారావమ్మ మాతాజీ ఆరాధన

బెల్లంకొండ: మండలంలోని వెంకటాయపాలెంలోని కొండ శింగరేశ్వర స్వామి ఆశ్రమంలో మాతాజీ శీతారావమ్మ 8వ ఆరాధన కార్యక్రమాన్ని మంగళవారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. 2017 జనవరి 2వ తేదీన అకాల మరణం పాలైన శీతారావమ్మ మాతాజీని స్మరించుకుంటూ ఆరాధన కార్యక్రమాన్ని జరుపుకుంటున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. వేకువ జామున గ్రామస్తులు మాతాజీ ఆశీనురాలైన పవిత్ర స్థలంలో ప్రత్యేక అలంకరణలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ అన్నదాన కార్యకమంలో గ్రామస్తులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపుగా 2 వేల మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం 7 నుంచి గ్రామంలో జెండా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

యడ్లపాడు: గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. యడ్లపాడు దిగువ ఎస్సీ కాలనీకు చెందిన శామ్యూల్(50) పిల్లికొండ సమీపంలో జాతీయ రహదారిని దాటుతున్న క్రమంలో గుంటూరు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి, ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్రగాయాలతో శామ్యూల్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతనిపై నుంచి రెండు వాహనాలు దూసుకెళ్లడంతో.. ముఖం గుర్తించలేని విధంగా ఛిద్రమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటివారిపాలెం, ముప్పాళ్ళ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎం, వీవీప్యాట్‌ల పై ఓటర్లకు అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. తహసీల్దార్ ఎమ్.భవానీశంకర్ పాల్గొని ఓటర్లకు ఈవీఎంలపై ఉన్న అపోహలను తొలగించారు. ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత వీవీ ప్యాట్ ద్వారా స్లిప్ వస్తుందని, ఏమైనా సందేహాలుంటే పరిశీలించుకోవచ్చన్నారు. ఏ గుర్తుకు ఓటరు ఓటు వేశారో స్లిప్‌లో కనిపిస్తుందన్నారు. ఓటర్ల సందేహాలను స్వయంగా పరిశీలించి, వారిచే ఓటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, వీఆర్వో అశోక్, మాబువలి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో...

సత్తెనపల్లి: రానున్న ఎన్నికలను పురస్కరించుకొని పట్టణంలోని 32, 33, 34 పోలింగ్ కేంద్రాల్లో మంగళవారం ఈవీఎంలపై అవగాహన కల్పించారు. బీఎల్ఏలకు ఈవీఎంల పని తీరుపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించినట్లు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి తెలిపారు. సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం

అమరావతి: రాష్ట్రంలో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని పాస్టర్స్ ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి నండూరి పీటర్ పాల్ అన్నారు. అమరావతిలో మంగళవారం అమరావతి మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీటర్ పాల్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఫెలోషిప్ ఆధ్యాత్మిక బోధనలు చేస్తూ మండల ప్రజలకు సేవలు అందిస్తుందన్నారు.

ప్రతిభ గుర్తింపునకే ‘ఆడుదాం ఆంధ్రా’



క్రికెట్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, పీఈటీలు, క్రీడాకారులు



రెంటచింతల-1 సచివాలయ పరిధిలో హోరాహోరీగా వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఎంపీపీ దాసరి చౌడేశ్వరి

రెంటచింతల: గ్రామీణ ప్రాంతాలలోని ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహించి మంచి నైపుణ్యం కల్గిన క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. మంగళవారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఆమె, వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్ల ముత్తయ్యతో కలిసి క్రికెట్, వాలీబాల్ ఆటలపోటీలను ప్రారంభించి మాట్లాడారు. మారుమూల గ్రామీణ ప్రాంతాలలో సైతం నిర్వహిస్తున్న ఈ పోటీలను యువత సద్వినియోగం చేసుకుని వారిలో దాగిన ప్రతిభను మెరుగు పరచుకుని మంచి నైపుణ్యం సాధించాలన్నారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, చేస్తున్న పని పట్ల శ్రద్ధ పెరుగుతుందన్నారు. యువత క్రీడాస్ఫూర్తితో ఈ పోటీలలో పాల్గొనాలని కోరారు. మల్లవరం, రెంటచింతల-1 సచివాలయాల పరిధిలో క్రికెట్, వాలీబాల్ ఆడించగా హోరాహోరీగా జరిగిన పోటీలలో విజయం సాధించిన జట్లు మండల స్థాయి పోటీలలో పాల్గొంటారని పీఈటీ కత్తి రవి తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గుండా కిశోర్, కార్యదర్శి వెంకయ్య, పీఈటీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష ఒక వరం



ఆరోగ్య శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గోలి(రెంటచింతల): రాష్ట్ర ప్రజలందరికీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఒక వరం అని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. మంగళవారం మండలంలోని గోలి గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండోదశ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్ ప్రజలకు ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఉచితంగా వైద్య సేవలు, మందులు ఇచ్చే విధంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబ ఆరోగ్య విషయాలను ఒక యాప్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ యాప్ సమాచారం ఆధారంగా తదుపరి చికిత్సలు ఎక్కడ చేయించాలన్న దానిపై అవగాహన ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మున్నా చంద్రం, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, గోలి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ బి.ప్రదీప్‌రెడ్డి, ఈవోపీఆర్డీ గుంట్రెడ్డి అనంత కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ గాలి ముత్యాలుఅంజి, కార్యదర్శి సుబ్బారావు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే మెరుగైన వైద్యసేవలు

మాచవరం: ప్రజావసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు క్షేత్రస్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు డివిజనల్ నోడల్ అధికారి డాక్టర్ భువనేశ్వరి, ఇండింపెండెంట్ తహసీల్దారు, ట్రైనీ కలెక్టర్ కల్పనశ్రీ పేర్కొన్నారు. మండలంలోని పిన్నెల్లి సచివాలయం-2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అధికారులు కార్యక్రమాన్ని సందర్శించి, వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత వైద్య సేవలు అందించి, ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం రెండవ విడత కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. 216 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, పీహెచ్‌సీ వైద్యాధికారులు చక్రవర్తి, ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, స్థానిక గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ఎస్సీలు

మాచవరం: ప్రజాపాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనా విధానాలకు ఆకర్షితులై పలువురు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మాచవరం మండలంలోని మోర్జంపాడు గ్రామానికి చెందిన 10 ఎస్సీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి ఆయన సమక్షంలో మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అధిక ప్రాధాన్యత కల్పించి సుభిక్ష పాలన అందిస్తున్నారని, అందుకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ విజయానికి కృషి చేస్తామని పార్టీలో చేరిన పలువురు తెలిపారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, యూత్ కన్వీనర్ మద్దు ప్రసాదు, జిల్లా కార్యదర్శి జిలుగు నరసింహారెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ మారం బ్రహ్మారెడ్డి, రవీంద్రారెడ్డి, చిన సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కృషి అమూల్యం



కొప్పునూరు జెడ్పీహెచ్ఎస్‌లో మోడల్ టెస్ట్ పేపర్ అందజేస్తున్న దృశ్యం

మాచర్ల రూరల్: తమకు విద్యనందించి, తమ భవిష్యత్‌కు ఉన్నత బాటలు వేసిన పాఠశాలను మరువకుండా విద్యార్థులకు విలువైన పుస్తకాలను అందించిన పూర్వ విద్యార్థుల కృషి అమూల్యమని హెచ్ఎం ఐ.వి.నాగమణి కొనియాడారు. మంగళవారం మండలంలోని కొప్పునూరు గ్రామ జెడ్పీహెచ్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు మోడల్ టెస్టు పేపర్లు ఇచ్చి మాట్లాడారు. అలుగురాజుపల్లి గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సురేష్ తాను చదువుకున్న పాఠశాల విద్యార్థులకు విలువైన మోడల్ టెస్టు పేపర్లు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు నరేష్, ఉపాధ్యాయులు ఆర్ ప్రసాద్, పాల్‌రాజ్, అప్పారావు, మధు, రామ్మోహన్, యాసిఫ్, నారాయణ తదితరులున్నారు.

ఆడపిల్లలు పుట్టడం అదృష్టంగా భావించాలి

ఏరియా వైద్యశాలలో బంగారు తల్లి పథకం ప్రారంభం



బంగారు తల్లి పథకం ప్రారంభోత్సవంలో ఆడపిల్లలు, తల్లులతో కొత్త రామకృష్ణ

సత్తెనపల్లి: ఆడపిల్లలు పుట్టడం తల్లిదండ్రులు అదృష్టంగా భావించాలని సత్తెనపల్లి ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ అన్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల ప్రకారం పట్టణంలోని ఏరియా వైద్యశాలలో బంగారు తల్లి పథకాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్త రామకృష్ణ మాట్లాడుతూ ఆడపిల్లలు ఏమాత్రం తక్కువ కాదన్నారు. కలెక్టర్ లోతేటి శివశంకర్ ఎన్నో వినూత్న సేవ కార్యక్రమాలు చేపట్టారని, అందులోనూ ముఖ్యమైంది బంగారు తల్లి పథకం అన్నారు. ప్రతి మంగళవారం బంగారు తల్లి పథకాన్ని నిర్వహిస్తామని, వారంలో పుట్టిన ఆడపిల్లలు తల్లిదండ్రులతో ఫొటో తీసి ఆ ఫ్రేమ్‌ని తల్లిదండ్రులకి అందజేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు సహకారంతో వైద్యశాల అవార్డులను అందుకుంటూ దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి మంగళవారం బంగారు తల్లి పథకాన్ని నిర్వహిస్తామని, పుట్టిన ఆడపిల్ల తల్లిదండ్రులతో కేక్ కటింగ్ సెలబ్రేషన్ అదే విధంగా ఫొటో ఫ్రేమ్ అందజేయడం జరుగుతుందన్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్ సుజాత మాట్లాడుతూ నెలలో సుమారు 150 నుంచి 170 ప్రసవాలు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో జరుగుతాయన్నారు. వారిలో 60 శాతం ఆడపిల్లలు పుడుతున్నారన్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్ సుష్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, ఫార్మసీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఏఓ గంగా భవాని, కౌన్సిలర్ సునీత, ఆడపిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు వేయించండి

క్రోసూరు: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా బుధవారం నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల పశు వైద్యుడు డాక్టర్ మల్లయ్య మంగళవారం తెలిపారు. వివరాల కోసం గ్రామ సచివాలయం(రైతుభరోసా కేంద్రం), లేదా పశు వైద్యాధికారి, లేదా టెలి మెడిసన్ కాల్‌సెంటర్ 1962ను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా గాలికుంటువ్యాధి లక్షణాల గురించి డాక్టర్ మల్లయ్య తెలుపుతూ తీవ్రమైన జ్వరం, నీరసం, కొద్దిపాటి ఎండకు రొప్పటం, చూడి పశువులు ఈసుకుపోవటం, ఎద్దులలో పనిసామర్థ్యం తగ్గటం వంటి లక్షణాలుంటాయన్నారు. తద్వారా పాల ఉత్పత్తి, పనిసామర్థ్యం గణనీయంగా తగ్గిపోవటం, రైతుకు ఆర్థిక నష్టం కలుగుతుందన్నారు. పాలు తాగే దూడలలో మరణాలు సంభవిస్తాయన్నారు. వైద్యం నిర్లక్ష్యం చేస్తే పశువులు చనిపోతాయన్నారు. కాబట్టి నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. పశువు గుర్తింపు కోసం చెవిపోగు తప్పనిసరి అన్నారు. కావున పాడి రైతులు, పశు పోషకులు, జీవాల యజమానులు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని డాక్టర్ మల్లయ్య కోరారు.

రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్తా

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దాచేపల్లి : ఫ్లై ఓవర్ అంశాన్ని రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. దాచేపల్లి-కారెంపూడి మార్గంలోని కేసానుపల్లి రైల్వేగేట్‌పై ఫ్లై ఓవర్ నిర్మించేందుకు రైల్వే అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో కేసానుపల్లికి చెందిన కొంతమంది తమకు ఫ్లై ఓవర్ వద్దు.. ఆర్‌యూబీ నిర్మించాలని కోరుతూ దాచేపల్లి హైవేపై మంగళవారం ధర్నా చేశారు. అనంతరం నారాయణపురం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని బాధితులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఫ్లై ఓవర్ నిర్మాణం వలన గేట్‌కి ఇరువైపులా నివసించే తాము ఇబ్బంది పడతామని, రైల్వే అధికారులు ఇచ్చిన మార్కింగ్ ప్రకారం ఇళ్లను కూడా కోల్పోతున్నామని వివరించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలతో చర్చించి ప్రజలకు, ఆస్తులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులను కోరతామని ఎమ్మెల్యే కాసు చెప్పారు. ఆయన వెంట నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్ తదితరులున్నారు.

ఘనంగా సీతారాముల శోభాయాత్ర

ఇంటింటికీ అయోధ్య రాముని అక్షింతల పంపిణీ



కారెంపూడిలో కొనసాగిన శోభాయాత్ర



దుర్గిలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

కారెంపూడి: శ్రీరామ జన్మభూమి భవ్య మందిర ప్రతిష్ట సందర్భంగా కారెంపూడిలో మంగళవారం వేలాదిగా భక్తులు సీతారాముల చిత్రపటాలతో కషాయరంగు జెండాలతో శోభాయాత్ర నిర్వహించారు. చెన్నకేశవస్వామి ఆలయం నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర కొనసాగింది. మహిళల కోలాట ప్రదర్శనలు సంప్రదాయ వాయిద్యాలతో కన్నులపండువగా జరిగింది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులకు స్వామి వారి అక్షింతలు, చిత్రపటం, కరపత్రాలను నిర్వాహకులు పంపిణీ చేశారు.

అయోధ్య రాముని అక్షింతల శోభాయాత్ర

దుర్గి: శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు, అయోధ్య నుంచి వచ్చిన అక్షింతల శోభాయాత్ర మంగళవారం మండల కేంద్రమైన దుర్గిలో ఘనంగా నిర్వహించారు. శ్రీరామ సేవా సమితి, ఆర్యవైశ్య సంఘం, విశ్వహిందూ పరిషత్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘల ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి ఆలయం నుంచి రామాలయం వరకు అక్షింతల శోభాయాత్ర ప్రధాన వీధుల గుండా సాగింది. మండలంలోని గ్రామాలలో ప్రతి హిందూ బంధువుకు అక్షింతలు చేరే విధంగా కృషి చేయనున్నట్లు మండల ఆర్యవైశ్య సంఘం నేత కపిలవాయి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెలిదండి శ్రీనివాసరావు, ధర్మవరం ససర్పంచ్ గంగారపు వెంకటరెడ్డి, పలువురు మహిళా భక్తులు, ఆర్యవైశ్య సంఘం నేతలు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్

విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ అందజేత



గామాలపాడులో జగనన్న విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులు



జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు చిత్రంలో కౌన్సిలర్ కిరణ్



ఎస్ఎస్‌సీ మోడల్ స్టడీ బుక్స్‌తో విద్యార్థులు



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

పిడుగురాళ్ల: విద్యతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని కౌన్సిలర్ మాదాల కిరణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు రూ.1500 విలువైన జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కౌన్సిలర్ మాదాల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో పలు మార్పులు తీసుకురావడానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థులు లక్ష్యాలకు అనుగుణంగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం లింగాల ధనలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించండి

దాచేపల్లి : పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ దోహదపడుతుందని జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి అన్నారు. మండల వ్యాప్తంగా జిల్లా పరిషత్ హైస్కూల్, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న 650 మంది విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దారని, విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా విద్యాజ్యోతి పుస్తకాలు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, ఎంపీపీ కటకం జయశ్రీ, సర్పంచ్‌లు జంగా సురేష్, అంజిరెడ్డి, కర్పూరపు వెంకటకోటయ్య, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, ఎస్ఎంసీ చైర్మన్ షేక్ సైదావలి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్

దుర్గి: రామకృష్ణ సేవా సమితి, మాచర్ల వారి ఆధ్వర్యంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను మంగళవారం ఉచితంగా కన్వీనర్ మెట్టు గోవిందరెడ్డి అందజేశారు. మండలంలోని ఓబులేశునిపల్లె జెడ్పీహెచ్ఎస్‌లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో తయారు చేసిన స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివేందుకు 10వ తరగతి ఉత్తీర్ణత ఎంతో ముఖ్యమన్నారు. ఈ స్టడీ మెటీరియల్‌ను నియోజకవర్గంలోని ప్రభుత్వ, కస్తూర్బా, కేబీవీఎస్ పాఠశాలలకు ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, వెంకటప్పారావు, రవిబాబు, ప్రశాంతి, సేవా సమితి సభ్యులు తదితరులున్నారు.

విద్యార్థులకు స్టడీ బుక్స్ అందజేత

రెంటచింతల: విద్యార్థి జీవితంలో కీలకమైన 10వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులు రామకృష్ణ సేవా సమితి సభ్యులు అందచేసిన యూటీఎఫ్-ఎస్ఎస్‌సీ మోడల్ స్టడీ బుక్స్‌ను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలను సాధించాలని రామకృష్ణా సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వైఆర్ఎస్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఆయన స్టడీ బుక్స్‌ను అందచేసి మాట్లాడారు. పల్నాడు ప్రాంతంలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా రామకృష్ణ సేవా సమితి మాచర్ల నియోజకవర్గంలోని జెడ్పీ, కస్తూర్బా, సోషల్ వేల్ఫేర్ పాఠశాలలతో పాటు ప్రయివేటు పాఠశాలల్లో కూడా స్టడీ బుక్స్‌ను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రణాళికాబద్ధంగా చదువుకుని మెరుగైన ఫలితాలను సాధించాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం కొత్తా చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, సేవాసమితి సభ్యులు మహేష్‌రెడ్డి, గోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ అందజేత

మాచవరం: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ, విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి, విద్యార్థులకు బంగారు భవిష్యత్‌ను అందిస్తుందని జెడ్పీటీసీ శివాయాదవ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు జగనన్న విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్ మంగళవారం అందజేశారు. స్టడీ మెటీరియల్‌ను ఉపయోగించుకొని విద్యార్థులు పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, స్థానిక సర్పంచ్ రాగిడి నరేష్, ఎంపీటీసీ చిట్టిప్రోకలు, గురవయ్య, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ వంకాయల రమేష్, హెచ్ఎం సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

మిర్చి పంట పరిశీలన

క్రోసూరు: మండలంలోని బయ్యవరం గ్రామానికి చెందిన రైతు కొతారు కృష్ణారావు ఫిర్యాదు మేరకు వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ సీవీ రమణ మంగళవారం పిందెలు, కాయలు రాని మిరప పంటను పరిశీలించినట్లు ఏడీఏ హనుమంతరావు తెలిపారు. మిరప పంట ఎదుగుదల లేక, కాయలు, పిందెలు లేక బొబ్బరతెగులు ఆశించినట్లు పరిశీలనలో తేలిందన్నారు. శాస్త్రవేత్త మొక్కల శ్యాంపిల్‌ను సేకరించి తీసుకెళ్లినట్లు ఏడీఏ వివరించారు. ఏఓ వేణుగోపాల్, జీనెస్ కంపెనీ ప్రతినిధులు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాలను సందర్శించి ఎన్ఆర్ఐలు



75త్యాళ్ళూరులో విద్యార్థుల పఠనా సామర్థ్యం పరిశీలిస్తున్న ఎన్ఆర్ఐలు

పెదకూరపాడు: గతంలో కంటే నేడు ప్రభుత్వ పాఠశాలలు రూపురేఖలు మారిపోగా, విద్యాబోధన సైతం పూర్తిగా మారిందని ఎన్ఆర్ఐలు గుత్తికొండ గురవారెడ్డి, కమల దంపతులు తెలిపారు. మండలంలోని 75 త్యాళ్ళూరు జెడ్పీ పాఠశాలను మంగళవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నాడు-నేడు ద్వారా వచ్చిన మార్పులు, ఐఎఫ్ ప్యానెల్స్ బోర్డులు, బైజూస్ కంటెంట్ ట్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్ ద్వారా జరుగుతున్న విద్యాబోధనను పరిశీలించారు. అనంతరం జూనియర్ కళాశాల, కిచెన్ గార్డెన్, జగనన్న గోరుముద్ద తదితర అంశాలను పరిశీలించారు. భవిష్యత్‌లో తమ వంతు సహాయం పాఠశాలకు అందిస్తామన్నారు. హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు గుత్తికొండ శ్రీనివాసరెడ్డి తదిరులు పాల్గొన్నారు.

బాజీచౌదరిపై చర్యలు తీసుకోవాలి

నకరికల్లు: దళిత యువకులను అతి దారుణంగా కొట్టి గాయపరిచిన తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి బాజీచౌదరిపై కఠినచర్యలు తీసుకోవాలని మాలమహానాడు సోషల్‌మీడియా ఇన్‌చార్జి గోదా బాల మంగళవారం డిమాండ్ చేశారు. క్రోసూరు మండలానికి చెందిన నలుగురు ఎస్సీ యువకులపై కుంకలగుంట గ్రా మంలో గత ఆదివారం దాడిచేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అధికార, కుల అహంకారంతో దళితులపై దాడికి పాల్పడిన బాజీచౌదరిపై కేసునమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేకుంటే తమ సంఘం బాధితుల తరఫున పోరాడుతుందని అన్నారు.